# పద్దుకు వేళాయెరా..

## రేపే కేంద్ర బడ్జెట్ • టాప్-10 అంచనాలివే

న్యూఢిల్లీ, జనవరి 30: మరికొద్ది గంటల్లో కేంద్ర బడ్జెట్ ఆవిష్కృతం కానున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఎప్పట్లాగే ఈసారీ సమాజంలోని ఆయా వర్గాలు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజానీకం, సగటు ఉద్యోగులు పద్దుపై బోలెడు ఆశలు, అంచనాలు పెట్టుకున్నారు. ప్రధానంగా వ్యక్తిగత ఆదాయ పన్నుకు సంబంధించి ఊరటనివ్వాలని పెద్ద ఎత్తున కోరుతున్నారు. మరి వాటిని మోదీ సర్కారు ఏ మేరకు నెరవేరుస్తుందో చూడాలి. ఇక రాబోయే బడ్జెట్‌పైనున్న టాప్-10 అంచనాలివే..

### ఐటీ శ్లాబులు-రేట్లు

కొత్త, పాత వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) విధానాల్లో శ్లాబులు, రేట్లను మార్చాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుకుంటున్నారు. అయితే ఐదేండ్ల కిందట కొత్త ఆదాయ పన్ను విధానాన్ని తీసుకొచ్చిన మోదీ సర్కారు.. అప్పట్నుంచి పాత ఆదాయ పన్ను విధానం జోలికే వెళ్లడం లేదు. కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడానికే ప్రతీ బడ్జెట్‌లో సవరణలు చేస్తూ వస్తున్నది. దీంతో ఈసారి కొత్తదానిలో వార్షిక ఆదాయం రూ.20 లక్షలు, అంతకుమించి ఉంటేనే 30 శాతం పన్ను వేయాలన్న డిమాండ్లు భారీగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రూ.15 లక్షలు దాటితే 30 శాతం పన్ను పడుతున్నది. అలాగే రూ.12-15 లక్షల శ్లాబుపై వర్తిస్తున్న 20 శాతం పన్నును 15 శాతానికి కుదించి.. కొత్తగా రూ.10-15 లక్షల శ్లాబును తీసుకురావాలని కోరుతున్నారు.

### స్టాండర్డ్ డిడక్షన్

కొత్త ఆదాయ పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను లక్ష రూపాయలకు పెంచాలని పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. పెంచితే మరింత మంది ట్యాక్స్‌పేయర్స్ కొత్త విధానంలోకి వచ్చే వీలుందని నిపుణులూ చెప్తున్నారు. ఇక కిందటి బడ్జెట్‌లో రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంచిన విషయం తెలిసిందే. మరోవైపు పాత పన్ను విధానంలోనూ స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75వేలకు పెంచాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

### పన్ను మినహాయింపు

కొత్త ఆదాయ పన్ను విధానంలో ఇప్పుడు వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉంటే ఎలాంటి పన్ను లేదు. అయితే దీన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక పాత ఆదాయ పన్ను విధానంలోనూ ఈ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2.5 లక్షల నుంచి 3 లక్షలకు పెంచాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

### ఆదాయ పన్ను రిబేటు

ప్రస్తుతం వ్యక్తిగతంగా పన్ను సహిత ఆదాయం ఏటా రూ.7 లక్షలదాకానే ఉంటే పూర్తిగా ట్యాక్స్ రిబేటుకు వీలుంటున్నది. అయితే దీన్ని ఈసారి బడ్జెట్‌లో రూ.10 లక్షలకు పెంచాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుతున్నారు. కొత్త ఆదాయ పన్ను విధానంలో రావాలని కోరుతున్న ఈ మార్పుతో మధ్యతరగతి వర్గాలకు పెద్ద ఊరట లభిస్తుందని చెప్తున్నారు. వినిమయ శక్తి కూడా పెరిగి మార్కెట్‌కు కొత్త ఉత్సాహం వస్తుందనీ నిపుణులు పేర్కొంటున్నారు.

### సెక్షన్ 80సీ

కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ ప్రయోజనాలను తేవాలని పలువురు ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. ప్రస్తుతం పాత ఆదాయ పన్ను విధానంలో సెక్షన్ 80సీ కింద ఏటా గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా పన్ను మినహాయింపులను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చన్న సంగతి విదితమే. ఇదిలావుంటే దీన్ని రూ.2 లక్షలకు పెంచాలని పాత ఆదాయ పన్నును ఎంచుకొంటున్నవారూ డిమాండ్ చేస్తున్నారు.

### ఎన్‌పీఎస్‌కు ప్రోత్సాహకాలు

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను మరింత మంది ఎంచుకొనేలా ఈ బడ్జెట్‌లో పలు నిర్ణయాలు, ప్రోత్సాహకాలు ఉండొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి పూర్తిగా పన్ను మినహాయింపును కల్పించవచ్చని, పాత ఆదాయ పన్ను విధానంలో ఉన్నట్టుగానే.. కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ ఎన్‌పీఎస్‌కు రూ.50వేలదాకా అదనపు పన్ను ప్రయోజనాలను కల్పించవచ్చని చెప్తున్నారు.

### హెచ్ఆర్ఏ ప్రయోజనాలు

మెట్రోపాలిటన్ ప్రాంతాలకుతోడు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఉంటున్నవారికీ హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ) ప్రయోజనాలు అందేలా ఈసారి బడ్జెట్‌లో చర్యలుంటాయని అంచనా. బేసిక్ సాలరీలో 40 శాతానికి బదులుగా 50 శాతానికి హెచ్ఆర్ఏ మినహాయింపుల్ని పెంచవచ్చని చెప్తున్నారు.

### సెక్షన్ 80డీ

పెరిగిన ఖర్చుల దృష్ట్యా ఆరోగ్య బీమా ప్రీమియంలూ పెరిగిపోతున్నాయి. సమగ్ర కవరేజీ కోసం మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితి పాలసీదారులకు వచ్చింది. దీంతో కొత్త ఆదాయ పన్ను విధానంలో ఆరోగ్య బీమా కోసం చేసే ప్రీమియం చెల్లింపులపై ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఉండే ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరుతున్నారు.

### సెక్షన్ 80జీ/80టీటీఏ


స్వచ్ఛంధ సంస్థలకు విరాళాలు పెరిగేలా, బ్యాంకుల్లో పొదుపును ప్రోత్సహించేలా ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80జీ/సెక్షన్ 80టీటీఏ ప్రయోజనాలను కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ అమలుపర్చవచ్చని అంచనా.

### గృహ రుణగ్రహీతల కోసం..

నిర్మాణ రంగానికి ఊతమిచ్చేలా స్థిరాస్తి కొనుగోలుదారులకు వివిధ రకాల పన్ను ప్రయోజనాలను బడ్జెట్‌లో ప్రకటిస్తారని అంచనాలున్నాయి. ఇందులో భాగంగానే గృహ రుణగ్రహీతలకు అసలు, వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపులను పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏటా రూ.2 లక్షలదాకా పన్ను ప్రయోజనాలను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చు. అయితే దీన్ని రూ.3 లక్షలకు పెంచవచ్చని అంటున్నారు. అలాగే ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల ప్రక్రియను మరింత సులభతరం చేయవచ్చని కూడా చెప్తున్నారు.

### చివరగా..

*ప్రస్తుతం దేశంలోని ట్యాక్స్‌పేయర్లలో 78 శాతం కొత్త ఆదాయ పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు. దీంతో పాత ఆదాయ పన్ను విధానాన్ని కోరుకుంటున్న ఆ మిగతా 22 శాతం మందినీ కొత్త విధానంలోకే తెచ్చేందుకు ఈసారీ పాత విధానంలో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చని, కొత్త దానిలోనే సవరణలు చేస్తారన్న అంచనాలు నిపుణుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ముమ్ముందు పాత పన్ను విధానాన్ని పూర్తిగా ఎత్తేసే వీలు కూడా లేకపోలేదన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. కేవలం పాత ఆదాయ పన్ను విధానంలోనే వివిధ సెక్షన్ల కింద రకరకాల ఆదాయ-వ్యయాలకు, పెట్టుబడులు-పొదుపులకు ఇప్పుడు ట్యాక్స్‌పేయర్స్ పన్ను మినహాయింపులను కోరే వెసులుబాటు ఉంటున్న సంగతి విదితమే.*




## బడ్జెట్ కూర్పులో నిర్మల టీం ఇదే..

**వీ అనంత నాగేశ్వరన్:** ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి. భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారుగా పనిచేస్తున్నారు.

**మనోజ్ గోవిల్:** ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి. మధ్యప్రదేశ్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. కేంద్ర వ్యయ కార్యదర్శిగా ఉన్నారు.

**అజయ్ సేథ్:** ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి. బడ్జెట్ డాక్యుమెంట్లకు తుదిరూపునివ్వడంలో నేర్పరి.

**తుహిన్ కాంత పాండే:** ఆర్థిక, రెవిన్యూ కార్యదర్శి. ఒడిషా కేడర్ ఐఏఎస్ అధికారి.

**అరుణిష్ చావ్లా:** ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ కార్యదర్శి. బీహార్ కేడర్ ఐఏఎస్ అధికారి.

**ఎం నాగరాజు:** త్రిపురకు చెందిన 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆర్థిక సేవల కార్యదర్శిగా ఉన్నారు.




## ఫెడ్ వడ్డీరేట్లు యథాతథం

వాషింగ్టన్, జనవరి 30: వరుసగా వడ్డీరేట్లను తగ్గించుకుంటూ వచ్చిన అమెరికా ఫెడరల్ రిజర్వు ఈసారి రేట్లను యథాతథంగా ఉంచింది. ద్రవ్యోల్బణ గణాంకాలు పుంజుకుంటుండటం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలసీల ప్రభావంతో వేచి చూసేదోరణిలో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఈసారి రేట్లను యథాతథంగా ఉంచడానికి మొగ్గుచూపింది. గడిచిన ఏడాదికాలంలో రేట్లను 5.3 శాతం నుంచి 4.3 శాతానికి దించింది.

## బీవోబీ లాభం 4,837 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 30: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,837 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,579 కోట్ల లాభంతో పోలిస్తే 5.6 శాతం వృద్ధి కనబరిచినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.34,676 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.31,416 కోట్లతో పోలిస్తే 10 శాతం వరకు పెరిగింది. దీంట్లో వడ్డీల ద్వారానే రూ.30,908 కోట్ల ఆదాయం సమకూరింది. గత త్రైమాసికంలో బ్యాంక్ ఆపరేటింగ్ ప్రాఫిట్ రూ.7,015 కోట్ల నుంచి రూ.7,664 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం ఇచ్చింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 3.08 శాతం నుంచి 2.43 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.7 శాతం నుంచి 0.59 శాతానికి దిగొచ్చింది. అయినప్పటికీ మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ గత త్రైమాసికంలోనూ రూ.1,082 కోట్ల నిధులు వెచ్చించింది.

## దొడ్ల డెయిరీ 280 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జనవరి 30: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ దొడ్ల డెయిరీ లిమిటెడ్ అంచనాలకుమించి రాణించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.63.56 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.41.33 కోట్లతో పోలిస్తే 54 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. కంపెనీ ఆదాయం రూ.752.5 కోట్ల నుంచి రూ.912.20 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. వ్యాపార విస్తరణలో భాగంగా రూ.280 కోట్ల పెట్టుబడితో మహారాష్ట్రలో నూతన పాల శీతలీకరణ ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఎండీ దొడ్ల సునీల్ రెడ్డి తెలిపారు. ఈ నిధులను కంపెనీ అంతర్గత వనరుల ద్వారా సేకరిస్తున్నట్లు, అలాగే రోజుకు 17.1 లక్షల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరించి ప్రాసెసింగ్ చేస్తున్నట్లు చెప్పారు.

## ఇప్పట్లో 'బిల్డ్ నౌ' పోర్టల్ లేనట్టే!

**అందుబాటులోకి రాని సాఫ్ట్‌వేర్ • పాత విధానంలోనే 'రియల్' అనుమతులు**

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రియల్ అనుమతులు పొందడం ఇక సులభతరమే అని ఆశలు పెట్టుకున్న వ్యాపారులకు నిరాశే దక్కింది. ప్రభుత్వం ప్రకటించిన బిల్డ్ నౌ పోర్టల్‌కు ఆటంకాలు మొదలయ్యాయి. కొత్త పోర్టల్‌కి సంబంధించిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాలేదని తెలిసింది. ఎప్పుడు అందుబాటులోకి వస్తుందన్న అంశంపైనా క్లారిటీ లేకుండా పోయింది. దీంతో వ్యాపారస్తులు పాత విధానంలోనే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

**కనిపించని చిత్తశుద్ధి..**

'బిల్డ్ నౌ' పేరిట కొత్త పోర్టల్ విధానాన్ని ఫిబ్రవరి 1నుంచి అమల్లోకి తీసుకువస్తున్నట్టు స్వయంగా మంత్రి శ్రీధర్‌బాబు గత నెల మొదటి వారంలో అధికారికంగా ప్రకటించారు. కానీ ఆ మేరకు చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్టు కనిపించటంలేదు. రియల్ అనుమతుల కోసం జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ, డీటీసీపీ వంటి విభాగాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఏఐ సహకారంతో బిల్డ్ నౌ పోర్టల్ విధానాన్ని తెరపైకి తెచ్చారు. కానీ, సంస్థల నుంచి అనుమతులు పొందడంతోపాటు అధికారులు ఏ విధంగా దరఖాస్తులు స్వీకరించి, అనుమతులు మంజూరు చేయాలన్న అంశాలపై ఇప్పటికీ శిక్షణ ఇవ్వలేదు.

## ఎన్‌ఎల్‌సీ ప్రాజెక్టులపై కిషన్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌ఎల్‌సీ) ప్రాజెక్టులపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2047 నాటికి వికసిత్ భారత్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రధాని మోదీ విజన్‌లో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖలో పలు సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఒడిశాలోని తాలాబిరా, మచ్చకట పాత్రపారాల్లో.. జార్ఖండ్‌లోని సౌత్ పచ్వారా, నార్త్ దాదుల్లో బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఎన్‌ఎల్‌సీ ద్వారా విశేషమైన కృషి జరుగుతుందన్నారు. ఎన్‌ఎల్‌సీలో పని చేసే కార్మికులు, ఉద్యోగులకు ప్రమాద బీమా వర్తించేలా పరిశీలించాలని సూచించారు




చెరువును తలపిస్తున్న రోడ్డు

## నమ్మండి.. ఇది రోడ్డే

మంథని రూరల్, జనవరి 30: మంథని పట్టణానికి కూతవేటు దూరంలో ఉండే ప్రధాన రహదారి చిన్న పాటి చెరువును తలపిస్తున్నది. మంథని నుంచి సూరయ్యపల్లి మీదుగా న్యూ రచ్చపల్లి గ్రామంలో నుంచి గోపాల్‌పూర్, చిన్న ఓదాల, బిట్టుపల్లి, ధర్మారం, సీతంపల్లి, ఖమ్మంపల్లి, భూపాలపల్లి జిల్లా, వరంగల్ జిల్లాలోని గ్రామాలకు వెల్లే ప్రజలు నిత్యం ఈ దారి గుండా వెళ్తుంటారు. ఇంత రద్దీగా ఉండే ఈ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు మొత్తం చిన్నగా ఉండడంతో పాటుగా రోడ్డు పక్కన ప్రమాద కరంగా కాలువలు ఉండటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అనేక మార్లు వాహన చోదకులు కింద పడ్డ సందర్భాలు ఉన్నాయి. ఇంత రద్దిగా ఉండే ఈ రహదారిని ఎవ్వరు పట్టించుకోక పోవడంతో పక్కనే ఉన్న పొలాల నుంచి నీరు సైతం రోడ్డు పైకి వచ్చి వాహన దారులను ప్రమాదాలకు గురి చేస్తుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రహదారిని వెడల్పు చేసి ప్రమాదాల భారినుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

## హెల్మెట్ ధరించి...అవగాహన కల్పించి

రామగిరి, జనవరి 30: కల్వచర్లలోని కేటీఎస్ పాఠశాల విద్యార్థులు గురువారం హెల్మెట్ ధరించి ప్రధాన రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థి రిశ్విక్ యమ ధర్మరాజు వేషధారణతో అవగాహన కల్పించాడు. హెల్మెట్ లేకుండా వచ్చే వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుంటే నరకానికి తీసుకెళ్తా అంటూ ఆకట్టుకున్నాడు .ట్రాఫిక్ నిబంధనలను విద్యార్థులు బాగా వివరించారనీ, వాహన దారుల్లో మార్పు రావడం కోసమే ఇలాంటి కార్యక్రమం చేపట్టినట్లు రామగిరి ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, హెచ్ఎం బర్ల శ్రీనివాస్, డైరెక్టర్లు అనిల్‌కుమార్, రంజిత్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

### ఇసుక రికార్డులు బహిర్గతం చేయాలి

ఓదెల, జనవరి 30: మానేరు నదిలో టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల పరిధిలో కొనసాగుతున్న ఇసుక రవాణా లెక్కలు బహిరంగంగా ప్రకటించాలని కనగర్తి గ్రామానికి చెందిన ఎన్జీటీ పిటిషన్‌దారు చిటికేసి సతీశ్ డిమాండ్ చేశారు. పర్యావరణ చట్టాలకు విరుద్ధంగా చెక్‌డ్యాంల ముసుగులో డిసిల్టేషన్ పేరుతో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా పై తాము సాగించిన న్యాయ పోరాటం ఫలితంగా ఎన్జీటీ ఇసుక క్వారీలను రద్దు చేస్తూ గత సంవత్సరం మేలో తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. అయితే మానేరు తీర ప్రాంత రైతాంగం జీవనోపాదులను పరిరక్షించాల్సిన నూతన ప్రభుత్వం ఈ తీర్పు పై సుప్రీంకోర్టులో అప్పీల్‌కు వెళ్లి ఇసుక దందాను యథాతథంగా కొనసాగిస్తుందని పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుండా మానేరులో ఇష్టారాజ్యంగా విధ్వంసం కొనసాగుతుందని ఆరోపించారు. సుప్రీంకోర్టులో ఈ నెల 27న తాము చేసిన వాదనల ఫలితంగా స్టాక్ యార్డ్‌ల నుంచి తరలించిన ఇసుక నిల్వలకు సంబంధించిన వివరాలన్నీ ఆరు వారాల్లోగా సమర్పించాలని రాష్ట్ర మైనింగ్ శాఖను సుప్రీంకోర్టు ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు ఇసుకకు సంబంధించిన లెక్కలను పారదర్శకంగా ప్రజల ముందు ప్రకటించి తమ నిజాయితీని నిరూపించుకోవాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇసుక మాఫియాను అడ్డుకుంటామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సతీశ్ కోరారు.

### బల్దియా అసిస్టెంట్ కమిషనర్ బదిలీ

కోల్‌సిటీ, జనవరి 30ః రామగుండం నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న టీ.రాజలింగు బదిలీ అయ్యారు. ఆయన్ను మంచిర్యాల జిల్లా మందమర్రి మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌ఛార్జి కమిషనర్ అరుణ శ్రీ శాలువా కప్పి సత్కరించారు. ఈమేరకు గురువారం ఆయన నగర పాలక సంస్థ విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

## గురుకుల విద్య.. ఉజ్వల భవిష్యత్‌కు బాట

పెద్దపల్లి కమాన్, జనవరి 30 : పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఏర్పాటు చేసిన గురుకులాల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా గురుకులాల్లో బోధన అందిస్తుండటంతో, ఫలితాల్లో విద్యార్థులు అఖండ విజయాలను సొంతం చేసుకుంటున్నారు. దీంతో గురుకుల విద్యకు డిమాండ్ పెరిగింది.. సోషల్ వెల్ఫేర్ పరిధిలోని సీవోఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్), ట్రైబ ల్ వెల్ఫేర్ పరిధిలోని ఎస్‌వోఈ (స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్)లో విద్యార్థులకు ప్రత్యేకంగా ఐఐటీ, నీట్, జేఈఈ కోచింగ్ ఇస్తున్నారు. అలాగే సోషల్ వెల్ఫేర్ పరిధిలోని సైనిక్ స్కూల్‌లో ఎయిర్ ఫోర్స్, నేవీ, ఆర్మీ శిక్షణ, ఫైన్ ఆర్ట్ స్కూల్‌లో డ్రాయింగ్, మ్యూజిక్, నాటికల ప్రదర్శనలో ప్రత్యేక శిక్షణ ఇస్తుండడం విశేషం. ప్రవేశ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మాత్రమే సీవోఈ, ఎస్‌వోఈ, సైనిక్, ఫైన్ ఆర్ట్ విద్యాలయాల్లో అవకాశం ఉంటుంది. కాగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో గురుకులాల్లో ఫుడ్ పాయిజన్లు, పాము కాట్లతో విద్యార్థులు చనిపోవడంతో, ఈ ఏడాది గురుకులాల్లో చేరేందుకు తల్లిదండ్రులు, విద్యార్థులు జంకుతున్నారు. పెద్దపల్లి జిల్లాలో 13 గురుకులాలు ఉండగా, ఇందులో ఆరు ఎస్సీ (సాంఘీక సంక్షేమ) గురుకులాలు, ఆరు బీసీ (మహాత్మా జ్యోతిబాపూలే) గురుకులాలు, ఒక జనరల్ గురుకుల విద్యాలయం ఉన్నవి. గురుకుల విద్యాలయాల్లో ఐదవ తరగతిలో ప్రవేశాల కోసం ఉమ్మడి ప్రవేశ పరీక్ష (కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. కాగా గౌలిదొడ్డి, అల్గునూర్‌లోని సీవోఈ, ఎస్‌వోఈ గురుకులాల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించారు. అలాగే రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజిగిరిలోని ఫైన్ ఆర్ట్ స్కూల్‌లో చేరేందుకు పరీక్ష నిర్వహించనున్నారు. అన్ని గురుకులాల్లో ప్రవేశాలకు ఒకే పరీక్షా పేపర్ ఉంటుంది. విద్యార్థులు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యాలయాలు, పరీక్ష వారికి సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించనున్నారు. సీవోఈ, ఎస్‌వోఈ, సైనిక్ స్కూల్, ఫైన్ ఆర్ట్ స్కూల్‌లో చేరాలంటే పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి, దరఖాస్తు చేసుకునే సమయంలో ఆ విద్యాలయాలను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఆసక్తి గల విద్యార్థులు 2025 ఫిబ్రవరి 1లోపు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, జనన ధృవీకరణ లేదా స్టడీ సర్టిఫికెట్‌తో పాటు ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలి. అన్ని గురుకులాల్లో ప్రవేశాలకు ఫిబ్రవరి 23న నిర్వహిస్తుండగా, జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మరింత సమాచారం కోసం విద్యార్థులు https:// tgcet.cgg.gov.in. వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు. పరీక్షకు సంబంధించిన సహాయం అందించేందుకు పెద్దపల్లి కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఏవైనా సందేహాలుంటే నెంబర్ 18005985459ను సంప్రదించవచ్చు.

**5వ తరగతిలో ప్రవేశానికి..**

జిలాల్లోని ఎస్సీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 2025- 26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష (కామన్ ఎంట్రెన్స్ టెస్టు) కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అలాగే ఎస్సీ గురుకుల విద్యాలయాల్లో 6 నుంచి 9వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ (బ్యాక్‌లాగ్) కోసం ఆయా గురుకులాల్లో పరీక్ష నిర్వహించనున్నారు.

## గనుల్లో అమరవీరుల దినోత్సవం

గోదావరిఖని, జనవరి 30: స్వాతంత్ర అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకోని సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని అన్ని గనులు, కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు అమరుల జ్ఞాపకార్థం మౌనం పాటించారు. ఆర్జీ-1 జీఎం కార్యాలయం వద్ద పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు మౌనం పాటించారు. ఇక్కడ ఏరియా రక్షణాధికారి సాయిప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రటరీ ఆరెల్లి పోశం, సీఎంఓఐ ఇన్‌చార్జి క్రాంతి, జీఎం కార్యాలం ఇన్‌చార్జి రాజు, ఏరియా ఇంజినీర్ దాసరి వెంకటేశ్వర్‌రావు, ఎన్విరాన్‌మెంట్ డీజీఎం ఆంజనేయప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్స్ బంగారు సారంగపాణి, శ్రావణ్‌కుమార్, హన్మంతరావు, బీమా, వసంత్‌కుమార్, వీరారెడ్డి, ఉమేశ్, అక్బర్ అలీ ఉన్నారు.

రామగిరి, జనవరి 30: సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలో గురువారం స్వాతంత్ర్య అమరవీరులకు నివాళులర్పించారు. అధికారులు, ఉద్యోగులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు మాట్లాడుతూ భరత మాత విముక్తి కోసం జరిగిన స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణత్యాగం చేసిన ఎంతోమంది త్యాగమూర్తులు, మహనుభావులు, సమరయోధులను స్మరించుకుంటూ జాతిపిత వర్ధంతి రోజున అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు సంతోష్, కోట రవీందర్ రెడ్డి, ఇంజనీర్ శేఖర్‌బాబు, అధికారులు చంద్రశేఖర్, రాజారెడ్డి, రాజేంద్రకుమార్, నాగేశ్వరరావు, సుధాకర్, ఐలయ్య, గుర్రం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



గోదావరిఖని : మౌనం పాటిస్తున్న అధికారులు, ఉద్యోగులు

## అంతర్జాతీయ పోటీలకు పల్లవి స్కూల్ విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, జనవరి 30: పెద్దపల్లి మండలంలోని నిమ్మనపల్లిలోని పల్లవి స్కూల్‌కు చెందిన నాలుగో తరగతి విద్యార్థిని ఎస్ శ్రీ ఆధ్య, ఐదో వతరగతి విద్యార్థి ఎస్ విహాన్ ఎస్‌వోపి సెకండ్ లెవల్ అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ ఎలువాక శోభారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిద్దరు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 9న జరిగే పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్రవంతి,షాజియా, సంతోష్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల సేవలను మర్చిపోలేం

కోల్‌సిటీ, జనవరి 30: తమ ఐదేళ్ల పదవీ కాలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేర్చడంలో అంగన్‌వాడీల పాత్ర మర్చిపోలేమని రామగుండం బల్దియా 12వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్ అన్నారు. ఈమేరకు గురువారం నాడు డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులను సన్మానించారు. ఆమె మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలోని పిల్లలకు పౌష్టికాహారం అందించడం, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం లాంటి సేవలు అందించారన్నారు. అనంతరం చిన్నారులకు పలకలు, బిస్కెట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, ప్రేమలత, రాజేశ్వరి, భారతి, లక్ష్మీ, వరలక్ష్మీతోపాటు నాయకులు కుమార్, రాజు, శ్రీకాంత్, నవీన్, పవన్, సురేశ్, రాజయ్య, సౌందయ్య, మొండక్క తదితరులు పాల్గొన్నారు.

### వాహన పన్ను చెల్లించాలి

పెద్దపల్లి, జనవరి30: జిల్లాలోని వాహనదారులందరూ సకాలంలో పన్ను చెల్లించాలని జిల్లా రవాణా అధికారి పీ రంగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సుమారు 3, 120 వాహనాలు వాహన పన్ను చెల్లించకుండా తిరుగుతున్నాయని పేర్కొన్నారు. వాహన తనిఖీలలో భాగంగా పట్టుకుంటే చెల్లించాల్సిన వాహన పన్నుపై అపరాధ రుసుం మొదటి నెల 50 శాతం, రెండవ నెల 100 శాతం, మూడవ నెల 200 శాతం అదనంగా వసూలు చేయబడుతుందని తెలిపారు.

### పలువురిపై కేసు

మంథని/మంథని రూరల్, జనవరి 30: గంజాయి కలిగి ఉన్న వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంథని మండలం ఎక్లాస్‌పూర్ గాడుదల గండి గుట్ట వద్ద ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. వారి వద్ద గంజాయితో పాటు రూ. 4వేలు ఉన్నాయి. మంథనిలోని శ్రీపాదకాలనీకి చెందిన తైదాల సురేశ్, తుత్తుర్ల మహేశ్, కోరవేన రవి సాగర్, ఆసంపల్లి కిరణ్, గుండా యశ్వంత్, టాంక్ గోవింద్ సింగ్, అంకూస్ గంజాయి సేవిస్తున్నారు. వీరంతా కలిసి రూ. 7వేలు జమ చేసి హైదరాబాద్‌లోని దూల్‌పేటలో లడ్డా అనే వ్యక్తి 500గ్రాముల గంజాయిని కొనుగోలు చేశారు. ఇందులో కొంత గంజాయిని రూ. 4వేలకు విక్రయించారు. ఇద్దరు కలిసి గంజాయి సేవించేందుకు గాడుదల గండి గుట్ట వద్దకు వెళ్లారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### విద్యుత్ సమస్య పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ 1912

పెద్దపల్లి, జనవరి30: విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు, సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీనంబర్‌ను సంప్రదించాలని పెద్దపల్లి ఎస్ఈ కంకటి మాధవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1912 టోల్ ఫ్రీ నంబర్ 24/7 వినియోగదారులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని పేరొన్నారు.

### జంతు పక్షోత్సవాలు

జూలపల్లి, జనవరి 30 : వడ్కాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పశు వైద్య-పశు సంవర్థక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జంతు సంక్షేమ పక్షోత్సవాలు నిర్వహించారు. జిల్లా పశు వైద్య శాఖ అధికారి శంకర్ విద్యార్థులకు జంతు సంరక్షణ చట్టాల గురించి వివరించారు. జంతువులను వేటాడడం, హింసించడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం దూస రమేశ్, ఉపాధ్యాయులు అశోక్, సంతోష్ కుమార్, వీణ, హరీశ్, కన్నయ్య, లక్ష్మీపతి, గోపాల్, సంపత్, శ్రీకళ పాల్గొన్నారు.

### ఫ్లెక్సీల తొలగింపు

మంథని, జనవరి 30: పట్టణంలోని ఆయా ప్రధాన చౌరస్తాల్లో ఉన్న రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను అధికారులు గురువారం తొలగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మున్సిపల్ అధికారులు గాంధీచౌక్, శ్రీపాదచౌక్, అంబేద్కర్ చౌక్, పాత పెట్రోల్ పంపుచౌరస్తా, బస్టాండ్ ఏరియాలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు సిబ్బందితో తొలగింప చేశారు.

### కెరీర్ కౌన్సిలింగ్‌పై శిక్షణ ప్రారంభం

జ్యోతినగర్, జనవరి 30: స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసోర్స్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కెరీర్ కౌన్సిలింగ్ శిక్షణను డీఈవో మాధవి గురువారం ప్రారంభించారు. జిల్లాలోని 115 జడ్పీ హైస్కూల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న యాక్టివ్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఒక్కొక్కరు చొప్పున శిక్షణకు హాజరయ్యారు. ఇక్కడ అకాడమిక్ మానిటరింగ్ అధికారి షేక్, మండల విద్యాధికారి చంద్రయ్య, కోర్సు కన్వీనర్ జయరాజు, జిల్లా రిసోర్స్ పర్సన్ ఆగయ్య, మల్లేశం, అబ్జర్వర్ ప్రద్యుమ్న కుమార్ పాల్గొన్నారు.